

ఘనంగా బోనాల జాతర


మంకమ్మతోటలో బోనాల ఉత్సవంలో పోతరాజుల విన్యాసాలు


బోనమెత్తుకున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కల్చరల్, జూలై 28: నగరంలోని పలు డివిజన్లలో గ్రామ, కుల దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని వేడుకున్నారు. మంకమ్మతోట, రాంనగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోచమ్మ బోనాల జాతరలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, గౌరవాధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాంచారి రాజయ్య, వేదాంతం సత్య నారాయణ, ఉపాధ్యక్షుడు చల్ల హరికృష్ణ, శ్రీరామ్ నరేందర్ పాల్గొన్నారు. విద్యానగర్ కొత్తయాస్వాడలోని పోచమ్మ ఆలయంలో జానపద గాయకురాలు వొల్లాల వాణి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. 24వ డివిజన్ కిసాన్‌నగర్ ఏకలవ్య కాలనీలో కాళికామాత బోనాల జాతరలో, 25వ డివిజన్‌లో మేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు. 16వ డివిజన్‌లో పోచమ్మ బోనాలు జరిపారు. జాతరల్లో ఆయా డివిజన్‌ల కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

● **కరీంనగర్ అర్బన్:** నగరంలోని రాంనగర్, మార్కండేయ కాలనీల్లో మున్నూరుకాపు కులస్థులు ఆదివారం నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొని బోనం ఎత్తుకొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెంట సత్యం, కొట్టె ప్రభాకర్, మెరుగు స్వప్నశ్రీ, పిట్టల రవీందర్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, నెల్లి నరేష్, పెద్దిగారి తిరుపతి, ఉప్పరి అజయ్, అల్వాల భరత్, కాంపల్లి కీర్తికుమార్, సతీష్, కొట్టె మల్లేశం పాల్గొన్నారు.


37వ డివిజన్‌లో బోనాల వేడుకలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ దంపతులు

పడకేసిన పారిశుధ్యం

- ప్రత్యేకాధికారుల పాలనతో గ్రామాల్లో ఇబ్బందులు
- ప్రబలుతున్న వ్యాధులు
- ఆందోళనలో ప్రజలు


రేకుర్తిలో డ్రైనేజీలో నిండిన చెత్తను చూపుతున్న స్థానికులు


దుర్శేడ్‌లో రోడ్డు పక్కన వేసిన చెత్త, తిరుగుతున్న పందులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పదిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా మారింది. దీంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. మురికి కాలువల నిర్వహణ, వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టే వారు లేక గ్రామాలు మురికికూపాలుగా మారాయి. దోమలు, ఈగలు పెరిగి ప్రజలను అనారోగ్యాల పాలు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రిలో ఇలా ఎక్కడ చూసినా ఓపితోపాటు ఇన్‌పేషెంట్ల సంఖ్య పెరిగిపోయింది.

● కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

జిల్లా ఆసుపత్రిలో సాధారణంగా ఓపి సంఖ్య 300 నుంచి 400 వరకు ఉంటుంది. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ఓపీ సంఖ్య రెట్టింపునకు చేరింది. కొద్దిరోజులుగా 500 నుంచి 600 వరకు చేరుకోగా, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్స్‌లలో ఓపీ సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మరోవైపు గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువై వాటి బారిన పడుతున్న పిల్లలు, పెద్దలు కుక్కకాటు ఇంజక్షన్ల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

ఉన్నతాధికారులు ఆదేశించినా..

సర్పంచులు, వార్డు సభ్యులు పదవుల నుంచి దిగిపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం కరువై పల్లెప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించండి.. గ్రామాల్లో మంచి నీరు కలుషితం కాకుండా చూడండి.. మురుగునీటి కాలువలను శుభ్రం చేసి వెంట వెంటనే సిల్ట్‌ను తొలగించండి.. దోమలు, పందులు ఆవాసాలు ఏర్పడకుండా ఉండే విధంగా బ్లీచింగ్ చేయడం, ఫాగింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టాలి.. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు అంటూ జిల్లా అధి కారయంత్రాంగం ప్రత్యేక అధికారులను ఆదేశిస్తున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు సరిగా జరుగడం లేదు. దీంతో గ్రామాల్లో దోమలు, ఈగలు రోజురోజుకు వృద్ధిచెందుతూ స్వైర విహారం చేస్తున్నాయి. వర్షాకాలంలో ఎక్కువగా పారిశుధ్య లోపం, కలుషిత మంచినీరు తీసుకోవడంతో అతిసార, టైఫాయిండ్, మలేరియా, మెదడువాపు, డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ వంటి అంటువ్యాధులు ప్రబలుతాయి. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలంటూ పారిశుధ్యం, రక్షిత మంచినీటిని అందించడమే కాకుండా ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దోమలు, ఈగలు వృద్ధిచెందకుండా, మంచినీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించింది. హోటళ్లు, మాంసం మార్కెట్లు, చిరుతిండి అమ్మే తోపుడుబండ్లు, దుకాణాల్లో తనిఖీలు చేయాలని, వ్యాధులు ప్రబలే అవకాశాలుంటే అలాంటి అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశించింది. పలు విషయాలపై సూచనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు మార్గదర్శకాలను విడుదల చేసింది.

వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి


రుద్ర రాము, మాజీ సర్పంచ్, జూబ్లీనగర్



కురుస్తున్న వర్షాలతో పల్లెల్లో వ్యాధులు ప్రబలుతున్నందున ప్రత్యేకంగా పారిశుధ్యంపై దృష్టిసారించాలి. అందుకు అవసరమైన నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలి. వర్షపు నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలి. పారిశుధ్య నిర్వహణకు అదనంగా నిధులు కేటాయించాలి.

జిల్లా వ్యాప్తంగా ఇదే స్థితి

జిల్లాలో 313 గ్రామపంచాయతీల్లో ఎక్కడో కొన్ని గ్రామాల్లో మినహా దాదాపు జిల్లావ్యాప్తంగా పారిశుధ్య పనులు సరిగా జరుగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. గ్రామపంచాయతీల్లో చెత్తను సేకరించే ట్రాక్టర్లు, ట్రై సైకిళ్లు అలంకారప్రాయంగా మారాయి. తప్ప పారిశుధ్య పనులకు ఉపయోగపడటం లేదని అంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు నామమాత్రంగా డెయిలీ శానిటేషన్ రిపోర్టులను మొబైల్ యాప్‌ల్లో నమోదు చేస్తున్న ఆచరణలో క్షేత్రస్థాయిలో పారిశుధ్య వ్యవస్థ అనేదే పనిచేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, పల్లెల్లో వర్షపు నీరు ఎక్కడపడితే అక్కడ నిలిచింది. రోడ్లు దెబ్బతినడంతో రోడ్లపై ఏర్పడ్డ గుంతలు, ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో దోమలు, ఈగలు, పందులు ఆవాసాలుగా మారాయి. వీటిని అరికట్టక పోతే వ్యాధులు మరింత ప్రబలుతాయని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


గేట్‌వాల్వ్ వద్ద నిలిచిన వర్షపు నీరు

ఆర్వోబీ పనుల్లో జాప్యం

వర్షాలతో చిత్తడిగా మారిన రోడ్డు


ఆర్వోబీ పనుల్లో భాగంగా గుంతలమయంగా మారిన రహదారి

కరీంనగర్ రూరల్, జూలై 28: నగర శివారులోని రైల్వే స్టేషన్ గేటు వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలు పడి బురదమయంగా మారుతున్నాయి. రైల్వే గేటు వద్ద రోడ్డుపై నీరు నిలవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. గేటు పడ్డ సమయంలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. కరీంనగర్ శివారులో రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)ని నిర్మిస్తున్నారు. పిల్లర్‌ల దశలోనే పనులు నిలిచిపోయాయి. పక్కనే తాత్కలిక రహదారిని ఏర్పాటు చేశారు. మట్టితో వేసిన రోడ్డు వానలకు బురదగా మారింది. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఇక గేటు పడితే అంతే సంగతి.. కిలో మీటర్ల మేర వాహనాలు ఆగిపోవల్సిందే. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పదించి ఆర్వోబీని పూర్తి చేయాలని, అప్పటి వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


గేటు వద్ద నిలిచిన నీరు




చొప్పదండిలో రహదారిపై ఏర్పడిన గుంతలు



అధ్వానం.. అస్తవ్యస్తం

- అడుగడుగునా గుంతలు
- అసంపూర్తిగా రోడ్డు విస్తరణ పనులు
- బురదమయంగా మారిన చొప్పదండి ప్రధాన రహదారి

చొప్పదండి, జూలై 28: చొప్పదండిలో ఆర్భాటంగా ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్ ,రోడ్డు వెడెల్పు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అవగాహన, అనుభవం లేని కాంట్రాక్టర్ పనులను చేపట్టి మధ్యలో వదిలిపెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని డీ 86 కాలువ నుంచి గుమ్లాపూర్ క్రాస్ రోడ్ వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి వెడల్పు పనులు 2023 మార్చిలో ప్రారంభమయ్యాయి. అలస్యంగా పనులను చేపట్టిన కాంట్రాక్టర్ ఉన్న రోడ్డు మధ్యలో డివైడర్, రోడ్డుకు రెండు వైపులా డివైడర్ నిర్మించాడు. 2023 సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిపివేశాడు. తారు రోడ్డు 35 అడుగుల వరకు ఉండగా మధ్యలో డివైడర్‌తో ఇరుకుగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. రెండు వైపులా మట్టితో ఉన్న రహదారి వర్షాలకు చిత్తడిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బనితిన్నది. కరీంనగర్, మంచిర్యాల మధ్య నడిచే భారీ వాహనాలతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై చేపలు పడుతూ సీపీఐ నిరసన

భగత్‌నగర్, జూలై 28: కరీంనగర్ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని సీపీఐ నగర కార్యదర్శి గుడికందుల సత్యం అన్నారు. ఆదివారం నగరంలోని కట్టరాంపూర్ ఆటో స్టాండ్ నుంచి కోతిరాంపూర్ వెళ్లే దారిలో రోడ్డుపై నిలిచిన నీటిలో చేపలు పడుతూ వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ కరీంనగర్ స్మార్ట్‌సిటీలో చిరు జల్లులకు రోడ్లన్నీ జలమయమవుతున్నాయన్నారు. 9, 32, 11 డివిజన్లలో రోడ్లు వేస్తామని రెండు సంవత్సరాల క్రితం తవ్వి వదిలేశారన్నారు. దీంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయన్నారు. స్మార్ట్ సిటీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నాయని, 200 కోట్ల నిధులు ఎవరి జేబులు నింపాయని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే నగర అభివృద్ధికి నిధులు తీసుకు రావడంలో విఫలమయ్యారన్నారు. స్మార్ట్ సిటీ నిధులు పక్కదారి పట్టిస్తున్న కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే రోడ్లను బాగు చేయాలని, లేకపోతే ప్రజలతో కలిసి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యుడు పున్నం రవి, నాయకులు కోనేటి నాగమణి, గాజుల కనకరాజు, రాంపల్లి శ్రీనివాస్, ద్యావ అన్నపూర్ణ, రోజా, స్వరూప, లావణ్య, అనిల్, కృష్ణ పాల్గొన్నారు.


రోడ్డుపై నీటిలో చేపలు పడుతూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రు. 13 కోట్ల రోడ్ల నిర్మాణ పనులు రద్దు

- టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ దశలో నిలిపివేత
- మళ్లీ మంజూరు వచ్చేనా?
- వానాకాలంలో తప్పని కష్టాలు

కథలాపూర్, జూలై 28: గత సర్కారు పల్లె రోడ్లను మెరుగు పరచాలనే ఉద్దేశంతో మంజూరు చేసిన పనులు రద్దు కావడంతో గ్రామీణ జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న క్రమంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని వివిధ గ్రామాలను కలిపే రోడ్లకు నిధులు వెచ్చించింది. కాగా కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు ఈ పనులను రద్దు చేయడంతో మళ్లీ నిధులు కేటాయిస్తారా అనే సందేహం వ్యక్తమవుతోంది.

● టెండర్లు పూర్తయినా...

మండలంలోని పలు గ్రామాల లింకు రోడ్లు అధ్వాన్నంగా మారగా స్థానిక ప్రజాప్రతినిధులు పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తేవడంతో సుమారు 13 కోట్ల నిధులు కేటాయించారు. భూషణరావుపేట-కథలాపూర్ డబుల్ రోడ్డుకు రు. 6 కోట్లు, చింతకుంట వయా గుంటి పెరమాళ్ళ నుంచి కథలాపూర్‌కు రు. 2 కోట్లు, భూషణరావుపేట నుంచి మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు రు. 2 కోట్లు, దూలూరు నుంచి పోసానిపేట రోడ్డుకు రూ. 3 కోట్ల చొప్పున అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ రోడ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పాటు అగ్రిమెంట్ దశకు చేరుకోగా ఈ పనులను రద్దు చేసినట్టు తెలిసింది. ఎప్పటి నుంచో ఎదిరి చూస్తున్న భూషణరావుపేట-కథలాపూర్ రోడ్డు డబుల్ రోడ్డుగా మారుతుందని ఆశించినా నిష్ప్రయోజనమే అయింది. కాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక ఈ రోడ్ల నిర్మాణ పనులు ఎందుకు రద్దు చేశారనేది ప్రశ్నార్థకంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో నరక ప్రయాణంగా ఉంది.



భూషణరావుపేట - కథలాపూర్ రోడ్డు

● నిధులు మళ్లీ మంజూరు చేయాలని కోరాం

- నాగం భూమయ్య, మాజీ జడ్పీటీసీ



మంజూరైన రోడ్ల నిధులను రద్దు చేయడం వల్ల ప్రజలకు అసౌకర్యంగా ఉంది. అనేక సార్లు ఈ రోడ్లకు నిధుల కేటాయింపు కోసం ప్రభుత్వం దృష్టికి తెచ్చి మంజూరు చేయించాం. కాంట్రాక్టర్లు కూడా టెండర్లు వేసి పనులు చేపట్టడానికి ముందుకు వచ్చినా ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు అవస్థలు తప్పలేవు. జనం పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తెచ్చాము. సానుకూలంగా స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు.

భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

సిరిసిల్ల టౌన్, జూలై 28: భూమి ద్వారానే దళితులకు సామాజిక న్యాయం జరుగుతుందని ఓయూ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. సిరిసిల్ల పట్టణం వస్త్ర వ్యాపార సంఘం భవనంలో దళిత హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో మంద సుదర్శన్ అధ్యక్షతన 'దళితులు- సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసీం మాట్లాడారు. భారత సమాజంలో మనుషులకు కులం ద్వారానే గుర్తింపు ఉంటుందన్నారు. దేశంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దళిత ప్రజలు విస్తరించి ఉన్నారని, ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం దేశంలో 22 శాతం ఉన్నారని అన్నారు. వారి చేతుల్లో భూములు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా భూ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు జరిగాయన్నారు.

ఉద్యమాలతో సాధించుకున్న కొందరు దళితులు మాత్రమే భూములను సాగు చేసుకొని జీవించారన్నారు. గత ప్రభుత్వం దళితులు సాగు చేసుకున్న భూములను అభివృద్ధి పేరిట బలవంతంగా లాగేసుకుందని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే దాదాపు 2120 ఎకరాల సాగు భూమిని దళితుల నుంచి దొరలు, భూస్వాములు ధరణి పేరుతో లాక్కున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాడు దళిత జాతి ప్రజల కోసం రాజకీయ హక్కులను సాధించారని, ఓటు హక్కుతోపాటు చట్ట సభలో దళిత ప్రజలు ప్రాతినిధ్యం వహించేందుకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. గత ప్రభుత్వం దళితుల నుంచి లాక్కున్న భూములను తిరిగి ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో నేరెళ్ల బాధితులకు న్యాయం జరగలేదని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ న్యాయం చేయాలని కోరారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు అంకని భాను, మాజీ జడ్పీటీసీ గొట్టె రుక్మిణి, నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల తయారీపై సీఎం వ్యాఖ్యలు సరికాదు



దీక్షలో పాల్గొన్న నేతన్నలు

సిరిసిల్ల రూరల్, జూలై 28: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిరిసిల్లలో బతుకమ్మ చీరలను తయారు చేయించకుండా గుజరాత్‌లోని సూరత్ నుంచి కొనుగోలు చేసి తెచ్చిందంటూ అసెంబ్లీలో నేతన్నలను అవమానపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదని జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు చెప్పారు. వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని జిల్లా కేంద్రంలో చేపట్టిన రిలేదీక్షలు ఆదివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ఏఐటీయూసీ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పంతం రవి, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమలు సంక్షోభంలో కూరుకపోయి ఏడు నెలలవుతోందని, పరిశ్రమలపై ఆధారపడినవారికి ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఐదేళ్ల నుంచి ప్రభుత్వంపై ఆధారపడే వస్త్ర పరిశ్రమలు నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొన సాగించిన పథకాలను నిలిపివేయడం ఎంతవరకు సమంజమన్నారు.

సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తి జరిగిందా? లేదా? అనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. బతుకమ్మచీరల తయారీలో అవినీతి జరిగితే విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉత్పత్తి చేసిన నేతన్నల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని, వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను యజమానుల, ఆసాములు, కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం దీక్షలో వైపని గౌరవ అధ్యక్షుడు ఒగ్గు గణేష్, ఆసాముల సంఘం ఉపాధ్యక్షుడు పోరండ్ల శ్రీనివాస్, సామాజిక కార్యకర్త వెంగళ అంకయ్య, అంబటి రవీందర్, సందుపట్ల పోచమల్లు, తాటికొండ శ్రీనివాస్, బూర అంబరీషం కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్, గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.730 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. పైనుంచి 20,643 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇక్కడి నుంచి నంది, గాయత్రి పంప్ హౌస్‌లో నుంచి నాలుగు మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలో వర్షాలు కొనసాగుతూ ఉన్నాయి. ఆదివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా 31.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వర్షాలకు చెరువులు కుంటలు నిండిపోగా, మానేరు హుస్సేనిమియా వాగులు ఉప్పొంగుతున్నాయి.

● 'గాయత్రి' నుంచి 12,600 క్యూసెక్కుల నీరు..


గాయత్రి పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎస్సారెస్పీ మిడ్ మానేరుకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. శనివారం నాలుగు పంపుల ద్వారా విడుదల చేసిన నీటిని ఆదివారం కూడా అధికారులు కొనసాగించారు. ప్రస్తుతం 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలివెళ్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి ప్రవాహం కొనసాగుతోందని అధికారులు చెబుతున్నారు. నాలుగు బహుబలి పంపులతో 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు రెండో రోజు కూడా కొనసాగించారు. కాగా గ్రావిటీ కెనాల్‌లో నీరు నిండుగా ప్రవహించడంతో రైతుల కళ్లల్లో ఆనందం కదలాడుతోంది.

● ఉధృతంగా ప్రవహిస్తున్న వరద కాలువ..


కురిక్యాల వద్ద ఉధృతంగా పారుతున్న వరద కాలువ

గంగాధర: వరద కాలువ ఎల్లంపల్లి నీటితో ఉధృతంగా పారుతోంది. రామడుగు మండలం లక్ష్మీపూర్ పంపుహౌస్ నుంచి అధికారులు నాలుగు మోటర్లు ప్రారంభించారు. ఒక్కొక్క పంపు నుంచి 3,150 క్యూసెక్కుల నీరును అధికారులు విడుదల చేయగా ఇప్పటివరకు ఒక్క టీఎంసీ నీరు మిడ్ మానేరుకు చేరినట్లు గంగాధర మండల పరిధిలో కాలువను పర్యవేక్షిస్తున్న అధికారులు తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపూర్, కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి, గర్శకుర్తి, ఆచంపల్లి గ్రామాల్లో వరద కాలువ అంచులను తాకుతూ ఎల్లంపల్లి నీరు దిగువకు వెళుతోంది. వరద కాలువకు నీరు విడుదల చేయడంతో గంగాధర మండల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మల్యాల: ఎల్లంపల్లి నీటితో వరదకాలువ నిండుగా మారి జలకళను సంతరించుకుంది. గాయత్రి పంప్‌హౌజ్ నుంచి రెండురోజులుగా మిడ్‌మానేరుకు వరదకాలువ ద్వారా నీటిని విడుదల చేయగా వరదకాలువ 102కి.మీ వద్ద గల షానగర్ క్రాస్‌రెగ్యులరేటర్ నుంచి రాంపూర్ పంప్‌హౌజ్ వైపు కూడా కొంత మేర నీరు వస్తుంది. దీనికి తోడు మిడ్‌మానేరు వద్ద కూడా నీరు పూర్తిస్థాయికి చేరుకుంటుండడంతో ఎగువకు ఎల్లంపల్లి జలాలు ఎగబాకుతున్నాయి. దీంతో రాంపూర్ పంప్‌హౌజ్ వద్దకు ఆదివారం ఉదయం వరకే వరదకాలువలో నీరు సమృద్ధిగా చేరుకున్నాయి. రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద గేట్లు వేసి ఉండడంతో నీరు ఇక్కడి వరకు నిలిచి ఉన్నాయి. వరదకాలువలోకి నీరు చేరుకోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే మిడ్‌మానేరు నిండిన తరువాత శ్రీరాంసాగర్ వరకు నీటిని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వరదకాలువకు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.

● మిడ్‌మానేరుకు 12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

బోయినపల్లి: బోయినపల్లి మండలంలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి గ్రాయత్రి పంప్‌హౌజ్ ద్వారా 12 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను 306.36 ఉండగా నీటి నిల్ల సామర్థ్యం 27.50 టీఎంసీలకు గాను 6.66 టీఎంసీల నీరు ఉంది.


మూలవాగులో కలుస్తున్న వరద కాలువ నీరు

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి వరద


ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 28: ధర్మపురి వద్ద గోదావరి నది ఆదివారం ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీవర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు నిండి నీరు నదిలో చేరింది. దీనికి తోడుగా కడెం ప్రాజెక్టు నుంచి 4,682 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవహిస్తోంది. దీంతో ఆలయ స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

బస్సు కిందకు దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

● ఇద్దరు యువకులకు గాయాలు



బస్సు కింద ఇరుక్కున్న ద్విచక్రవాహనం

మల్యాల, జూలై 28: ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వెలుతుండగా అదుపుతప్పి ఆర్టీసీ బస్సుకింద పడడంతో స్కూటీని వదిలి పక్కకు దూకడంతో యువకులు గాయాల పాలు కాగా స్కూటీ బస్సు కింద కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల-కరీంనగర్ రహదారి మార్గంలోని వీఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల వద్ద జగిత్యాల నుంచి కొడిమ్యాలకు స్కూటీపై వెలుతున్న ఇద్దరు యువకులు ముందు గల కారును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా కరీంనగర్ వైపు నుంచి వస్తున్న నిర్మల్ ఆర్టీసీ బస్సును గమనించలేదు. అయితే యువకులు చాకచక్యంగా ద్విచక్రవాహనం వదిలి పక్కకు దూకగా స్కూటీ వాహనం ఆర్టీసీ బస్సు కింద పడింది. ఆర్టీసీ బస్సు కింద పడడంతో స్కూటీని లాక్కెల్లింది. అయితే త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పగా గాయపడిన యువకులును చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని యువకుడి ఆత్మహత్య


వాసుదేవరెడ్డి(ఫైల్)

జనగామ రూరల్, జూలై 28: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ సమీపంలో శనివారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న యువకుడిని జనగామ రైల్వే పోలీసులు గుర్తించారు. ముందుగా గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు రైల్వే పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్‌కు చెందిన ఏనుగు వాసుదేవరెడ్డి(19) మేడ్చల్ సీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో బీటెక్ చదువుతు న్నాడు. ఫస్ట్ ఇయర్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

బీర్‌పూర్. జూలై 28: మండలంలోని తాళ్ళధర్మారం గ్రామానికి చెందిన పొన్నం భూమన్నగౌడ్ ఆదివారం కొల్వాయి శివార్లలోని తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీదనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయానికి కొల్వాయి గ్రామంలో ఉన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గాయపడ్డా భూమన్న గౌడ్‌ను పరామర్శించి 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పంపించారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మర్రిపల్లి తిరుపతి అనే గీత కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడగా అతని గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గాయపడ్డ తిరుపతిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ కరువు

- అత్యాచారాలు, హత్యలపై పోరాటానికి సిద్ధం కావాలి - పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

కళ్యాణ్‌నగర్, జూలై 28: బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ కరువైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ ఆరోపించారు. ఆదివారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన పీవోడబ్ల్యూ ఏడో మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పురుష సమానత్వం కోసం, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమ భాగస్వామ్యం కోసం పోరాటం చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలపై హింస, మతోన్మాదం పెరిగిందని, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడినా అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. బిల్కిస్ బానుపై సామూహిక అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిని బీజేపీ సన్మానించిందని విమర్శించారు. దేశంలో రాజ్యాంగానికి విరుద్ధంగా సీఏఏ, ఎన్ఆర్‌సీ పౌర చట్టాలను తీసుకువచ్చి మతోన్మాదంతో వ్యవహరిస్తుందన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస చట్టాల కోసం పీవోడబ్ల్యూ బలమైన పోరాటం చేస్తుందని, మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చేసినా అది అమలు కావడం లేదని ఆరోపించారు. హక్కుల కోసం మహిళలు పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రధాన కార్యదర్శి మంగ మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించగలుగుతామన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధిలో ఉన్నా పని ప్రదేశాల్లో లైంగిక దాడులను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

● ర్యాలీ నిర్వహించిన మహిళలు..

పీవోడబ్ల్యూ మహాసభ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు కే జ్యోతి ఆధ్వర్యంలో ఐఎఫ్‌టీయూ కార్యాలయం నుంచి గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి లక్ష్మీనగర్, అశోక్‌నగర్ మీదుగా ఐఎఫ్‌టీయూ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయంలో జెండా ఆవిష్కరించి సభలను నిర్వహించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ నాయకురాళ్లు బుచ్చమ్మ, మంగ, రజిత, అమృత, సరోజన, శారద, స్వర్ణలత, స్వప్న, పద్మ, సత్తెమ్మ, ఐ కృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 20,370 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 20,370 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 32.657 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 72.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 624 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 26.805 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.408 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

హుజూరాబాద్, జూలై 28: హుజూరాబాద్ పట్టణంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక నివేదికలు చదివి వినిపించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సభ్యులు సంఘం చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్‌పాషా, ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ గోపాల్‌రావు, కోశాధికారి దుర్గాజీ, కొంరెల్లి, సత్యనారాయణ, గణపతిరెడ్డి, చారుదత్తు, రవీందర్, కాంతమ్మ, జయవర్ధన్, లక్ష్మినారాయణ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో భర్తీకి నోచుకోని సింగరేణి కోటా సీట్లు

- ● ఉద్యోగుల పిల్లలు అనాసక్తి
- ● ప్రత్యామ్నాయ మార్గం లేక మిగిలిపోతున్న సీట్లు
- ● పదేళ్లుగా ఇదే తంతు - పట్టించుకోని అధికారులు
- ● సింగరేణి ప్రభావిత గ్రామాల విద్యార్థులకు చోటు కల్పించాలని డిమాండ్



రామగిరి, జూలై 28: సింగరేణి నిధులతో నిర్మాణం జరిగిన మంథని జేఎన్టీయూలో సింగరేణి కోటాలో కేటాయించిన ఇంజనీరింగ్ సీట్లు భర్తీకి నోచుకోవడం లేదు. జేఎన్టీయూ కళాశాల నిర్మాణానికి పూర్తి సహకారం అందించిన సింగరేణి సంస్థకు జేఎన్టీయూ ఇంజనీరింగ్ సీట్లలో ఐదు శాతం సీట్లు సంస్థ ఉద్యోగులకు కేటాయించింది. అందులో భాగంగా ఆరు బ్యాచ్‌లు కల్గిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సూపర్ న్యూమరరీ కోటా కింద 18 సీట్లు ఉద్యోగుల పిల్లలకు అవకాశం కల్పించింది. కాగా 2021-22 వరకు ఐదు శాతం ఉన్న కోటాను 2022-23 విద్యా సంవత్సరానికి 10 శాతం పెంచింది. దాంతో ఇప్పటి వరకు 18గా ఉన్నా సీట్ల సంఖ్య 36కు పెరిగింది. కానీ పెరిగిన సంఖ్యకు అనుగుణంగా సింగరేణి ఉద్యోగుల పిల్లల నుంచి ఆశించిన మేర దరఖాస్తులు రావడం లేదు. దీంతో గడిచిన పదేళ్లుగా సూపర్ న్యూమరరీ సీట్లు మిగిలి పోతూనే ఉన్నాయి. ఇక నాలుగు సంవత్సరాల కౌన్సెలింగ్ వివరాలను పరిశీలిస్తే 2021-22లో సివిల్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానికల్, సీఎస్ఈ, మైనింగ్, సీఎస్ఈ(ఏఐ) విభాగాల ఒక్కో విభాగానికి మూడు సీట్లా చొప్పున 18 సీట్లు కేటాయించగా 13 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఐదు సీట్లు ఖాళీగానే ఉండిపోయాయి. అదేవిధంగా 2022-23 విద్యాసంవత్సరంలో కోటాను 10శాతానికి పెంచగా ఒక్కో విభాగంలో ఆరు సీట్ల చొప్పున 36 సీట్లు కేటాయించగా అందులో 26 సీట్లలో విద్యార్థులు చేరగా 10 సీట్లు మిగిలిపోయాయి. 2023-24 విద్యాసంవత్సరానికి గాను కేవలం 12 మంది విద్యార్థులు మాత్రమే సీట్లను ఎంపిక చేసుకోవడంతో 24 సీట్లు అలాగే ఉండిపోయాయి. ఇక ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి 36 సీట్లకు గాను 11 సీట్లు మాత్రమే విద్యార్థులు ఎంపిక చేసుకోగా 25 సీట్లు మిగిలిపోయాయి. సింగరేణి కోటా సూపర్ న్యూమరరీలో 36 సీట్లకు గాను 18 సీట్లు అధికారుల పిల్లలకు, 18 సీట్లు కార్మికుల పిల్లలకు కేటాయించగా ప్రస్తుతం అధికారుల పిల్లలు కేవలం తొమ్మిది మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా కార్మికుల పిల్లలు 27 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో అధికారుల పిల్లలు ఇద్దరు, కార్మికుల పిల్లలు తొమ్మిది మంది కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లను భర్తీ చేయగా 25 సీట్లు మిగిలిపోయాయి. తిరిగి రెండో కౌన్సెలింగ్ నిర్వహించినా ఇదే అధికారుల పిల్లలు, కార్మికుల పిల్లలు 36 మందిలో భర్తీ అయిన 11 మంది పోనూ మిగతా 25 మందిలో నుంచే కౌన్సెలింగ్‌కు హాజరు కావల్సి ఉంటుంది. అందులో నుంచి ఇప్పటికే వివిధ కళాశాలలో చేరి ఉండడంతో ఆ 25 సీట్లు మిగిలి పోయే అవకాశం ఉంది.

● ప్రభావిత గ్రామాల విద్యార్థులకు కేటాయించాలి..

మంథని జేఎన్టీయూ కళాశాలలో పది సంవత్సరాలుగా బ్యాక్‌లాగ్‌గా మిగిలిపోతున్న సూపర్ న్యూమరరీ సింగరేణి కోటా సీట్లలో ప్రభావిత గ్రామాల విద్యార్థులకు అవకాశం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది. సంస్థ కోసం ప్రత్యేక్షంగా, పరోక్షంగా అండగా ఉంటూ తమ భూములను దారాదత్తం చేసిన తమకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో సింగరేణి విఫలం అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కళాశాలలో బ్యాక్‌లాగ్‌లుగా మిగులుతున్న సీట్ల విషయంలోనైనా శ్రద్ధ వహించి ప్రభావిత గ్రామాలకు చెందిన విద్యార్థులకు జేఎన్టీయూలో అవకాశం కల్పించి సింగరేణి కోటాలో ప్రభావిత గ్రామాల విద్యార్థులను చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

● యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం..

గడిచిన పదేళ్ళుగా సింగరేణి కోటా సీట్లు ప్రతి సంవత్సరం మిగిలిపోతున్న దానికి ప్రత్యామ్నయ మర్గాలు అన్వేషించకుండా వర్సిటి అధికారులు నిర్లక్ష్య వహిస్తున్నారు. సూపర్ న్యూమరరీ కోటాలో మిగిలిపోయిన సీట్లను బ్యాక్‌లాగ్‌లుగా వదిలివేయకుండా జనరల్ కౌన్సెలింగ్‌లో చేర్చినట్లైయితే సామాన్య విద్యార్థులకు లబ్ది జరిగే అవకాశం ఉంది. దీనికి ప్రత్యేకమైన జీవోలు కాని ప్రభుత్వం నుండి అనుమతులు కాని అవసరం లేకున్నా కేవలం వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రతిష్టాత్మకమైన కళాశాలలో సీట్లు బ్యాక్‌లాగ్ గానే మిగిలిపోతున్నాయి.

ఆడుకుంటూ అనంత లోకాలకు..

- నీటి సంపులో పడి చిన్నారి మృతి

- గాజులపల్లిలో విషాదం


శ్రేయాన్స్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూలై 28: ఇంటిలో సందడి చేసే ఓ పసివాడి చిరునవ్వులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.. అమ్మా అంటూ తప్పటడుగులు వేస్తూ ఇళ్లంతా కలియతిరిగే చిన్నారి అడుగులు నిలిచిపోయాయి. ఆడుకుం టూ వెళ్లిన ఆ చిన్నారిని విధి అక్కున చేర్చుకుంది. ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడి మూడేళ్ల చిన్నారి పెద్దోళ్ల శ్రేయాన్స్ మృతి చెందిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపల్లిలో ఆదివారం విషాదం నింపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని పెద్దోళ్ల అనూష -కిషన్ దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు శ్రేయాన్స్ ఉన్నారు. అనూష-కిషన్ దంపతులు వ్యవసాయం చేస్తూ పిల్లలను పోషిస్తున్నారు. ఆదివారం సాయంత్రం తల్లి అనూష ఇంటిలో వంట పని చేస్తే, తండ్రి కిషన్ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. పిల్లలు ఇంటి ఎదుట ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు శ్రేయాన్స్ నీటి సంపులో పడిపోయాడు. కొడుకు కనిపించడం లేదని తల్లి ఇంటితో పాటు ఆరు బయట గాలించింది. అనంతరం తాగు నీటి సంపులో విగత జీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించింది. విషయం తెలుసుకున్న తండ్రి కిషన్ చేరుకుని సంపులో నుంచి శ్రేయాన్స్‌ను బయటకు తీసి హుటాహుటిన సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి చనిపోయాడని నిర్ధారించారు. కన్న కొడుకు అర్ధాంతరంగా మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించారు. అయ్యో కొడుకు అప్పుడే నూరేళ్లు నిండాయా..? అంటూ తల్లి అనూష కంటతడి పెట్టడం అక్కడున్న పలువురు హృదయాలను కదిలించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుతున్నామని వివరించారు.

కొడుకు మృతిని తట్టుకోలేక.. తల్లి మృత్యువాత

- 15 రోజుల వ్యవధిలో తల్లీకొడుకు మృతి

మల్యాల, జూలై 28: కొడుకు మృతిని తట్టుకోలేని ఆ తల్లి తనయున్నే తలచుకుంటూ మృత్యువాతపడింది. ఈ విషాదకరమైన సంఘటన మల్యాల మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. మల్యాలలోని బీసీ కాలనీకి చెందిన బెక్కం లక్ష్మణ్(24)అనే యువకుడు ఈ నెల 14 మొహర్రం వేడుకల్లో భాగంగా పులివేషధారణ వేసి తోటి మిత్రులతో వేడుకల్లో ఉండగానే అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కొడుకు మృతిని తలచుకుంటూ తల్లి లక్ష్మి(50) మదనపడుతోంది. ఆ బాధ నుంచి తేరుకోలేక ఆదివారం లక్ష్మి కూడా మృతి చెందింది. దీంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. 15 రోజుల వ్యవధిలోనే ఒకే కుటుంబంలోని తల్లి, కొడుకులు మృతి చెందడం స్థానికంగా కలచివేస్తోంది.

● ఎమ్మెల్యే ఆర్థిక సాయం..

బెక్కం లక్ష్మి ఆదివారం మృతి చెందడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మృతురాలి కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పంపించిన ఐదు వేల రూపాయ లను అందజేశారు. మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మ్యాక లక్ష్మన్, ఆగంతపు వంశీ, శనిగారపు తిరుపతి, ప్రతాప్, హరినాథ్, ప్రశాంత్, ఇమామ్ ఉన్నారు

ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందని.. యువకుడి బలవన్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


కథలాపూర్, జూలై 28: తాను ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించిందనే మనస్తాపానికి గురైన మాడవేని తిరుమలేశ్ (19) అనే యువకుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... మండలంలోని సిరికొండకు చెందిన తిరుమలేశ్ కోరుట్లలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అక్కడే ఓ యువతితో ప్రేమలో పడగా ఆమె వివాహం చేసుకోడానికి నిరాకరించింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిరుమలేశ్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆదివారం సిరికొండ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. శవాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెళ్లికి ఆర్థిక ఇబ్బందులతో యువతి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జూలై 28: పెళ్లికి అవసరమైన డబ్బులకు తల్లి, సోదరుడు ఇబ్బంది పడుతున్న విషయం తెలిసి మనస్తాపానికి గురై కరీంనగర్‌లోని బోయవాడలో కోమూరి ధరణి(21) అనే యువతి శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. ధరణికి తండ్రి లేడు. తల్లి, సోదరులు ఆమెకు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఒక యువకుడితో మూడు నెలల కిందట నిశ్చితార్థమైంది. అయితే పెళ్లి ఖర్చులకు కావాల్సిన డబ్బుల సర్దుబాటుకు ఇబ్బందికరంగా ఉందని తల్లి, కొడుకులు బాధపడుతున్న విషయం తెలుసుకున్న ధరణి ఇంటిలో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

పెళ్లి ఖర్చుల డబ్బులు, ఏర్పాట్ల పనుల నిమిత్తం ధరణి తల్లి, సోదరుడు శనివారం ఉదయం పెద్దపల్లికి బంధువు ఇంటికి వెళ్లారు. రాత్రి ధరణికి తల్లి ఫోన్ చేయగా స్పందించక పోవటంతో వెంటనే సమీపంలో ఉన్న ధరణి స్నేహితురాలిని వెళ్లి చూడమన్నారు. ఆమె వెళ్లేసరికి ధరణి ఉరికి వేళాడుతూ కనిపించింది. స్థానికులు ఆమెను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని వెల్లడించారు. పెళ్లికి డబ్బులు సర్దుబాటు అవ టం లేదని మనస్తాపంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి మాలతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



కరీంనగర్ క్రైం, జూలై 28: కరీంనగర్ బైపాస్‌రోడ్‌లో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దొంతినేని అభినయ్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన అభినయ్ నాలుగేళ్ళుగా కరీంనగర్‌లోని కాపువాడలో అద్దె గదిలో ఉంటూ ఒక కారు షోరూంలో టెక్నిషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో దాబాలో భోజనం చేసేందుకు బద్దం ఎల్లారెడ్డి విగ్రహం వద్ద నుంచి బైపాస్‌రోడ్‌లో తీగలవంతెన వైపు తన బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వర్షం కారణంగా, అతివేగంగా బైక్ నడపటంతో ఎల్‌పీజీ గ్యాస్ బంక్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టగా అభినయ్ స్ట్రీట్‌లైట్ పోల్‌కు ఢీకొని మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడు..

రాయికల్, జూలై 28: రాయికల్ పట్టణంలోని అల్లెపు రాజశేఖర్(30) అనే వ్యక్తి ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజశేఖర్ తన భార్యతో గొడవ పడగా భార్య పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన రాజశేఖర్ పట్టణ శివారులోని మామిడి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అన్న అల్లెపు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

విండ్యావాలిలో బోనాల సంబరాలు

కరీంనగర్ కల్చరల్, జూలై28: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ విండ్యావాలి ఉన్నత పాఠశాలలో ఆదివారం పోచమ్మ బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు బోనాలను ఎత్తుకుని అమ్మవారు, పులి, పోతరాజుల వేషాదారణలతో డప్పు చప్పుల మధ్య నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాష్‌రావు పోచమ్మతల్లికి జ్యోతి ప్రజ్వలన చేసి పూజను ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

కవి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ అంకయ్య మృతి



కరీంనగర్ కల్చరల్, జూలై 28: కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, నాటకకర్త, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బండారి అంకయ్య (85) ఆదివారం అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని తంగళ్ళపల్లి గ్రామంలో ఏప్రిల్ 24, 1939లో జన్మించారు. రాష్ట్ర స్థాయిలో లోక్‌సత్తా ఉద్యమకారుడిగా పదేళ్ళు పనిచేశారు. అంకయ్య కలం నుంచి జాలువారిన వక్రరేఖలు నాటిక, సీతారామరాజు, రుద్రమదేవి ఏకపాత్రాభినయాలు, చెమట మొక్కలు డాక్యుమెంటరీ, పాటలు, గేయాలు, రాజ్యాంశిల్పి అంబేద్కర్‌తో పాటు జీవన నానీలు, అక్షరతార, బతుకమ్మ వంటి పుస్తకాలు ప్రాచుర్యాన్ని పొందాయి. ఆయన మృతి పట్ల పలువురు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, కవులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ప్రజా సేవ చేయాలి



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు సత్యనారాయణను సన్మానిస్తున్న ఆర్డీవో

కరీంనగర్ టౌన్, జూలై 28: ఉపాధ్యాయుడిగా అనేక సంవత్సరాల నుంచి విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలు సత్యనారాయణ రాజకీయ అరంగేట్రం చేసి ప్రజలకు సేవలందించాలని కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ సూచించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన గంగాధర మండలం న్యాలకొండపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పోలు సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా పనిచేసిన ప్రతి పాఠశాలలో మంచి పేరు తెచ్చుకోవడమే కాకుండా పోపా జిల్లా అధ్యక్షుడిగా చేసిన సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ నల్ల వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆడెపు శ్రీనివాస్, సిరిసిల్ల డీపీవో వీరబుచ్చయ్య, మెట్‌పల్లి ఆర్డీవో నక్క శ్రీనివాస్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు మామిడాల సురేందర్, జిల్లా పోపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ యెలిగేటి మల్లికార్జున్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, పద్మశాలి సంక్షేమ ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, చేనేత ఐక్య వేదిక కన్వీనర్ శ్రీనివాస్, కోశాధికారి మంచికట్ల రమేశ్, స్వర్గం మల్లేశం, శ్రీనివాస్, మంచికట్ల రమేశ్, అలుస భద్రయ్య, పలువురు ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

యూట్యూబ్ కళాకారులకు సన్మానం



నటుడు, దర్శకుడు పాల్వాని వేణును సన్మానిస్తున్న దృశ్యం

కరీంనగర్ కల్చరల్, జూలై 28: హైదరాబాద్‌కు చెందిన బాబా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ఓ ఫంక్షన్‌హాల్లో కరీంనగర్ యూట్యూబ్ కళాకారులకు సన్మానం చేశారు. యూట్యూబ్ కళాకారుడు ఆర్ సదానందం, చైతన్య కాసర్ల హనుమంతు, యూట్యూబ్ నటి సీతామహాలక్ష్మి, రంగస్థల కళాకారులు తిప్పర్తి ప్రభు, గడ్డి ఉదయ్‌కుమార్ అతిథులుగా పాల్గొన్నారు. ప్రముఖ నటుడు, దర్శకుడు పాల్వాని వేణు, వ్యాఖ్యాత మాడిశెట్టి గోపాల్, గాయకుడు, నటుడు, దర్శకుడు కనపర్తి శ్రీనివాస్, నటులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది టీయూడబ్ల్యూ ఐజేయూనే



మాట్లాడుతున్న జాతీయ కౌన్సిల్ సభ్యుడు నగూనూరి శేఖర్

జమ్మికుంట, జూలై 28: పాత్రికేయుల సమస్యలపై నిత్యం పోరాడేది కేవలం టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘం మాత్రమే అని జాతీయ కౌన్సిల్ సభ్యుడు నగూనూరి శేఖర్ అన్నారు. జమ్మికుంట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల ప్రెస్‌క్లబ్ టీయూడబ్ల్యూజే ఐజేయూ సమావేశం జమ్మికుంట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్మిని శ్రీనివాస్ అధ్యతన ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా నగూనూరి శేఖర్ హాజరై సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాండ్ల శ్రీనివాస్, అడహక్ కమిటీ సభ్యులు ఎలగందుల రవీందర్, ఈద మధుకర్ రెడ్డి హాజరయ్యారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

చొప్పదండి, జూలై 28: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి, నాయకులు పురం రాజేశం, కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య, ముద్దసాని రంగన్న, కడారి శంకర్, గుర్రం రమేశ్, నిజానపురం చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి వినతి

రామడుగు, జూలై 28 : రామడుగు మండలం రుద్రారం గ్రామానికి చెందిన విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి బోరును మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గంగాధర, జూలై 28: సీజనల్ వ్యాదులపై కార్మికులు అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ వైద్యులు చీటి కార్తిక్ అన్నారు. ఆదివారం వైద్యశాల ఆధ్వర్యంలో ఒద్యారంలోని గ్రానైట్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకితే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు ఉచిత వైద్యసేవలందించే అవకాశం లభించినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రానైట్ ఫ్యాక్టరీల్లో పని చేస్తున్న వివిధ విభాగాల కార్మికులకు పరీక్షలు నిర్వహించి అనారోగ్యంతో ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల హెడ్ కిరణ్, వైద్యులు పబ్బ అవినాష్, కర్ణాకర్, మనోజ్‌కుమార్, ఫ్యాక్టరీ యాజమానులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మగ్గాల కార్మికుల దీక్షలు

గంగాధర, జూలై 28: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులు చేపట్టిన దీక్షలు ఆదివారం నాల్గవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు దీక్షకు సంఘీభావం తెలిపారు. మగ్గాల కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మరమగ్గాల కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నిరుపయోగంగా స్పోర్ట్స్ కిట్లు

-వినియోగంపై ప్రచారం కరువు -పట్టించుకోని అధికారులు



చెర్లబూత్కూర్ గ్రామ పంచాయతీలో వృథాగా ఉన్న స్పోర్ట్స్ కిట్

కరీంనగర్ రూరల్, జూలై28: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్లు నిరుపయోగంగా మారాయి. కరీంనగర్ మండలంలో 17 గ్రామాలకు గాను విద్యార్థులు, యువకులు ఆటలు ఆడుకునేందుకు మూడేళ్ల క్రితం గ్రామానికో క్రీడాప్రాంగణం నిర్మించారు. క్రీడా సామగ్రి లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా స్పోర్ట్స్ కిట్లు అందించింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ ముందు హడావుడిగా గతేడాది అక్టోబర్‌లో మండలంలోని మొగ్దుంపూర్ గ్రామంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ వాటిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు స్పోర్ట్స్ కిట్లను అప్పజెప్పారు. అయితే స్పోర్ట్స్ కిట్‌లో 14 రకాల ఆట వస్తువులు, క్రికెట్, వాలీబాల్, టెన్నికాయ్, స్కిప్పింగ్ రోప్స్, డంబెల్స్, టీషర్టులు తదితర వస్తువులు ఉన్నాయి. ఎంపీడీవో పర్యవేక్షణలో కార్యదర్శులకు కిట్లను వినియోగించే విధంగా బాధ్యతలను అప్పగించారు. క్రీడా ప్రాంగణాల్లో ఆట లపై సాధన చేశాక విద్యార్థులు, యువకులు వాటిని తిరిగి పంచాయతీ కార్యాలయంలో అప్పజెప్పాల్సి ఉంటుంది. దీనిపై ప్రచారం లేకపోవడంతో యువతకు, విద్యార్థులకు కిట్‌లు నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో క్రికెట్ కిట్లు పక్కదారి పట్టాయనే ఆరోపణలు ఉన్నాయి. కిట్ల వినియోగంపై గ్రామాల కార్యదర్శులకు ఆదేశాలు రాలేదని తెలుపుతుండగా అధికారులు మాత్రం ఇవ్వాలని చెప్పినట్లు తెలుపుతున్నారు. కానీ పంచాయతీలకు కాకుండా ప్రభుత్వ పాఠశాల లకు అప్పగిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

● మండలంలో పలు గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు కూడా పర్యవేక్షణ లేకుండా పోయింది. క్రీడా మైదానాలు ఏర్పాటు చేసిన కూడా నిరుప యోగంగా మారాయి. పల్లెల్లో ఉన్న స్థలాలను గుర్తించి మొక్కుబడిగా బోర్డులను ఏర్పాటు చేశారు. చెరువు శిఖం, ప్రభుత్వ స్థలాలు, విద్యుత్ స్థంబాలు ఉన్న ప్రాంతాలతో పాటు దూరంగా ఉన్న చెరువు ప్రాంతాలు గుర్తించి ఏర్పాటు చేయగా ఆటలకు ఇబ్బందిగా మారాయి. క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్న గ్రామాల్లో పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే విదంగా స్పోర్ట్స్ కిట్స్ అందుబాటులోకి తెచ్చి, మైదానాలను అభివృద్ధి చేయాలని గ్రామాల ప్రజలు, నాయకులు, యువకులు, విద్యార్థులు కోరుతున్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, జూలై 28: నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా రక్తం ఎక్కించాలని డాక్టర్లు ఆమె కుటుంబ సభ్యులకు సూచించారు. బి పాజిటివ్ రక్తం కోసం ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపెల్లి శ్రీనివాస్‌ను సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తన పుట్టిన రోజున రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు.

కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలి

భగత్‌నగర్, జూలై 28: కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించిందని కేబుల్ బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దు చేసి ప్రజా ధనాన్ని రికవరీ చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను గుర్తించని సంబంధిత శాఖ అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. రెండు వందల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన తీగల వంతెన సంవత్సరం కాక ముందే రోడ్డు పూర్తిగా గుంతలమయమై తారు తేలిపోయి బ్రిడ్జిపై వెళ్లాలంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానం

సుభాష్‌నగర్, జూలై 28: స్థానిక కాపువాడలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మున్నూరు కాపు లీగల్ సెల్ కన్వీనర్ రత్నాకర్, కామధేను డైరెక్టర్ సాధవేని మధుసూదన్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఆది మల్లేశం, కరీంనగర్ మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కన్వీనర్ దుగ్గు మహేందర్, రాకేశ్, నగర వాటర్ ప్లాంట్స్ యూనియర్ అసోసియేషన్ అధ్యక్షుడు కచ్చుకాయల రాజేందర్‌ప్రసాద్, కరీంనగర్ లయన్స్‌క్లబ్ కోశాధికారి బట్టు వినోద్, కరీంనగర్ ప్రింటింగ్‌ప్రెస్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త శ్రీనివాస్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లం లింగమూర్తిలను ఘనంగా సన్మానించారు.

'రావూస్'లో అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, జూలై 28: నగరంలోని రావూస్ స్కూల్‌లో ఇంటింట ఇన్నోవేషన్ అవగాహన సదస్సు 6వ ఎడిషన్ ఘనంగా నిర్వహించారు. నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని గ్రామీణ ప్రాంత యువత సద్వినియోగం చేసుకోవాలని ఇంటింటా ఇన్నోవేటర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ మణిదీప్ సూచించారు. ప్రిన్సిపాల్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించేందుకు సహాయపడ్డారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు

గణేశ్‌నగర్, జూలై 28: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో వినియోగదారులకు త్వరితగతిన సేవలనందించాడనికి కొత్త సాంకేతిక పద్ధతులని అవలంభిస్తున్నామని సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాదర్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ స్టోర్ విధా నాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. సంబంధిత సెక్షన్ ఏఇ., మొదటగా ఒక పనికి కావాల్సిన మెటీరియల్స్ స్టాక్ ఉందో లేదో ఏస్.ఎ.పి సాఫ్టవేర్ లో ఆన్‌లైన్‌లో చూసుకొని ఆ మెటీరియల్స్‌ను రిజర్వు చేసుకుంటారు. రిజర్వు చేసుకున్న మెటీరియల్స్ తాలూకు సమాచారం ఎస్.ఎ.పి వర్క్‌ఫ్లో ద్వారా సంబంధిత ఎ.డి.ఇ కి, తర్వాత స్టోర్స్ కి వర్క్‌ఫ్లో ద్వారా ఆన్ లైన్ లో వెళుతుందన్నారు.మెటీరియల్స్ తీసుకొనే అధికారికి, ఏ రోజు మెటీరియల్స్ తీసుకోవడానికి రావాలో ఆ తేదీనీ సమయాన్ని ఎస్ఎంఎస్ రూపంలో ఎస్.ఎ.పి మెయిల్ రూపంలో తెలియజేయబడుతుందన్నారు. తెలియజేసిన తేదీ సమయానికి స్టోర్ కి వెళ్లి మెటీరియల్‌ను తీసుకొని పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

దీనిలో పేపర్ ప్రస్తావన ఉండదని, మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. అందువల్ల చాలా సమయం ఆదా అవుతుందని, త్వరిత గతిన పనులు పూర్తి అవుతాయని సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాదర్ వివరించారు.

మంత్రి పొన్నంను కలిసిన గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రతినిధులు

కరీంనగర్ అర్బన్, జూలై 28: జిల్లా గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యవర్గం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం కలిసి సమస్యలను విన్నవించారు. అసోసి యేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అధ్యక్షులు జువ్వాడి ప్రణీత్‌రావు, నూతన కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షులు శంకరయ్యలు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసు కెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రానైట్ అసోసియేషన్ తరఫున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్ర మంలో నూతన కార్యవర్గ సభ్యులు మునీర్‌బాషా, రాచకొండ నరేశ్, ఆర్.విక్రమ్, జుట్టు మధు, ఈశ్వర్‌రెడ్డి, పెద్ది సత్యం, సోమినేని సురేందర్, జోగినిపల్లి భాను, ప్రహ్లద్, నితీష్ మిట్టల్, రాంభూపాల్ పాల్గొన్నారు.

'కరీంనగర్‌కు వెయ్యి కోట్లు తెచ్చే దమ్ముందా..?'

కరీంనగర్ అర్బన్, జూలై 28: కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి వెయ్యి కోట్లు మంజూరు చేయించే దమ్ము ఉందా అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ నియోజకవర్గంపై నిజంగా ప్రేమ ఉంటే వెయ్యికోట్ల కీలకమైన ప్రాజెక్టు మంజూరు చేయించి వేలాదిమంది యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుంచి పనులు చేస్తే దాన్ని అభివృద్ధి అనరని స్పష్టం చేశారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులలో నుంచి కేంద్ర ప్రభుత్వం 49 శాతం రాష్ట్రానికి కేటాయిస్తున్నదని తెలిపారు. వీటిని కూడా తమ కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని జబ్బలు చర్చుకోవడం సరైనదిగా లేదని ధ్వజమెత్తారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పూర్వ విద్యార్థులు



వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2000-01 పూర్వ విద్యార్థులు

హుజూరాబాద్, జూలై 28: హుజూరాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004-05 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో రాజు, నాగరాజు, అనిల్, ఎల్లయ్య, నరేష్, నవీన్, శ్రీనివాస్, కుమారస్వామి, మధు, శ్రీలత, కిరణ్మయి, స్వప్న, సబితా, సుమలత, కవిత, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-01 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఓ పంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. దాదపు 23 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఈ సందర్భంగా తమకు బోధించిన పాఠశాల ఉపాధ్యాయిలను ఘనంగా సన్మానించారు. తమతో చదువుకున్న విద్యార్థులు ఆపదలో ఉన్నారని తెలుసుకొని ఇద్దరికి పది వేయిల చొప్పున సహాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమృత ప్రభాకర్, ముద్దేర శ్రీనివాస్, బత్తుల తిరుపతి, గిరవేన రవీందర్, ముజమిల్, వనజ, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్లో భరోసా లేదు



మన్‌కీబాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

వీణవంక, జూలై 28: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు గ్యారంటీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు గ్యారంటీ లేదని దానికి తగిన బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు మాడ గౌతమ్ రెడ్డి, తిప్పని సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో 86వ బూత్ అధ్యక్షుడు కోరెం ఆదిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమం వీక్షించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, మండల ప్రధానకార్యదర్శి నరేందర్, శ్రీనివాస్‌గౌడ్, కొండాల్‌రెడ్డి, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మహంకాళి బోనాల పండుగ





మానకొండూర్‌లో బోనాలతో వెల్లుతున్న మహిళలు, రామడుగులో ..

మానకొండూర్, జూలై 28: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మానకొండూర్‌లో మహంకాళి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ బోనాల పండుగ సందర్భంగా అంబేద్కర్ కాలనీకి చెందిన మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బోనాలను పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. పిల్లా పాపలు, గొండు గోదా సల్లంగా ఉండి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని మహిళలు మొక్కులు చెల్లించారు.

రామడుగు: మండల వ్యాప్తంగా బోనాల వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంటికో బోనం చొప్పున తరలి వచ్చిన మహిళలు డప్పుచప్పుళ్ల, బైండ్ల పూజార్ల నృత్యాలు, శివసత్తుల పూనకాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగింపుగా పోచమ్మ గుడికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి చల్లంగా చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

చినుకు పడితే బస్టాండ్‌లో చిత్తడి



బురదమయంగా మారిన కేశవపట్నం బస్టాండ్

శంకరపట్నం, జూలై 25: మండల కేంద్రంలోని బస్టాండ్ చిత్తడిమయంగా మారుతోంది. శంకరపట్నం మండలంతో పాటు వీణవంక, సైదాపూర్ మండలాల్లోని కొన్ని గ్రామాల ప్రజలు వరంగల్-కరీంనగర్ వెళ్లడానికి నిత్యం శంకరపట్నం బస్టాండ్‌కు వస్తుంటారు. వర్షం పడితే బస్టాండ్ చిత్త డిగా మారుతోంది. బస్టాం డ్ ఆవరణలో ఓ వైపు నీరు మరోవైపు బురదతో ప్రయాణికులు నానాఅవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లోకి బస్సులు వచ్చినప్పుడు ప్రయాణికులపై బురద నీరు పడ్డ సందర్భాలు ఉన్నాయి. రోడ్డు కంటే బస్టాండ్ దిగువగా ఉండడంతో రోడ్డుపై వచ్చే వర్షపు నీరు బస్టాండ్‌లోకి చేరుతోంది. ప్రజాప్రతినిధులు, అధికా రులు చొరవ తీసుకొని బస్టాండ్‌లో మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ టౌన్, జూలై 28: నగరంలోని జ్యోతినగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో జ్యోతినగర్ వైశ్య కుటుంబాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వివాహమై 50 వసంతాలు పూర్తిచేసుకున్న 18 మంది దంపతులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సూర శ్రీనివాస్, కొమురవెల్లి ప్రభాకర్, వరుణ్‌కృష్ణ, పెద్ది శరత్, గర్రెపల్లి సత్యనారాయణ, పైడ జగదీశ్వర్, పైడ ప్రభాకర్, పుత్తూరు రవీందర్, సుదర్శన్, కొమురవెల్లి రాకేశ్, గర్రెపల్లి చంద్రం, యాద కిషన్, నార్ల వేణుగోపాల్, లక్ష్మన్, పడకంటి శ్రీనివాస్, వరప్రసాద్, పడమటిరెడ్డి రమేశ్, కట్కూరి ప్రభాకర్, తిరుమల లక్ష్మణ్, కోట శ్రీనివాస్, రాచకొండ రజనీకాంత్, తిరుమల లక్ష్మన్, గజవాడ శ్రీనివాస్, రావికంటి వైకుంఠం, అయిత సుధాకర్, నార్ల వేణు, తొడుపునూరి మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలు

కరీంనగర్ కల్చరల్, జూలై 28: నగరంలోని వినాయక నగర్‌లో ఆదివారం మహిళలు గోరింటాకుతో సందడి చేశారు. పరస్పరం గోరింటాకును అలంకరించుకొని మురిసిపోయారు. అంతకు ముందు గౌరీమాతకు పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీవాణి, కల్యాణి, లక్ష్మితో పాటు కాలని మహిళలు పాల్గొన్నారు.

ప్రజలను కుక్కల బెడద నుంచి రక్షించాలి

భగత్‌నగర్, జూలై 28: నగర ప్రజలను కుక్కలు, పందుల బెడద నుండి రక్షించాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు కోరారు. నగరంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువ అయిందని పాఠశాలలు, కళాశాలలు ఉన్న ప్రాంతాల్లో విద్యార్థులు కుక్కలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.కోతులు ఇళ్లలోకిప్రవేశించి నానా బీభత్సంచేస్తున్నాయన్నారు. పందుల భారీ నుండి నగర ప్రజలను రక్షించాలని, గతంలో మున్సిపల్ అధికారుల పందుల కోసం నగర శివారులో షెల్టర్లు ఏర్పాటు చేశామన్నారని, వాటిని ఎందుకు తరలించలేదన్నారు. కుక్కలు,కోతులు, పందులను నియంత్రించాల్సిన అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనకార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు.

సమాజ సేవలో భాగస్వాములుకావాలి

భగత్‌నగర్, జూలై 28: వ్యాపారవేత్తలు, సంఘ సంస్కర్తలు, మేధావులు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని గుజరాత్ రాష్ట్రం పోరుబందర్‌లోని సందీపిని విద్యానికేతన్ నిర్వాహకులు గురూజీ శ్రీ రమేష్ భాయ్ ఓజా అన్నారు. ఆదివారం ప్రముఖ వ్యాపార వేత్త కేసర్‌మల్ కార్వా జన్మదినోత్సవ సందర్భంగా కొతపల్లి మండలం బావుపేట శివారులోని శ్రీ దాస్ హనుమాన్ గోశాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం బాగున్నప్పుడే ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. సమాజంలో వివిధ సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు తగిన భరోసా తోడ్పాటును అందించడానికి సమజంలో గుర్తింపు ఉన్న వారు ముందుకు రావాలన్నారు. మెరుగైన సమాజం లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. గుజరాత్‌లోని పోరుబందర్‌లో విద్యానికేతన్‌లో దాదాపు 2వేల మంది బాలికలకు ఉచిత విద్యాభ్యాసం అంది స్తున్నామన్నారు. కార్యక్రమంలో భగవాన్ దాస్‌కార్వా, వేణుగోపాల్ కార్వా, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

కరీంనగర్ రూరల్, జూలై28: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన పొలాడి సాయి కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా, వారి కుటుంబానికి పటేల్ మిత్ర సంఘం వారు ఆర్థిక సాయం చేశారు. మంగళవారం మృతుడు సాయికుమార్ కుటంబ సభ్యులకు 19వేల నగదును, 25కేజీల బియాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆకిరెడ్డి యాదగిరి పటేల్, ప్రసిడెంట్ పోగులు అంజనేయులు పటేల్, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, ర్యాక మోహన్, చింతల కిషన్, దాది సుధాకర్, బట్టు రాజేం దర్, మామిండ్ల కిరణ్, నాడెం భూమయ్య, గాదె ఆదిరెడ్డి, మసినేని మారుతీశ్వర్, ర్యాకం సంపత్, తోట రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఆర్‌సీ హన్మకొండ జిల్లా చైర్మన్‌గా రాంపూర్‌వాసి

హుజూరాబాద్‌రూరల్, జూలై 28 : నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిటీ(ఎన్‌సీఆర్‌సీ) హన్మకొండ జిల్లా చైర్మన్‌గా రాంపూర్ గ్రామానికి చెందిన కుడికాల భాస్కర్‌రావును రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమస శ్రీకాంత్‌గౌడ్ ఆదివారం ప్రకటించారు.

ఈ మేరకు హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్ర మంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రచారాలు, అవగాహన సదస్సులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా పలు సేవ కార్యక్రమా లు అందించినందుకు గాను ఈ నియామకం జరిగింది. తన నియాకానికి కృషి చేసిన బాధ్యులకు భాస్కర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

శంకరపట్నం, జూలై 28: మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టళ్లు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికి విద్యార్థులకు కావాల్సిన వస్తువులు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. హాస్టల్ విద్యార్థులు పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా ఉందన్నారు. వెంటనే దారి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆది, సంతోష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి వాసికి డాక్టరేట్

- పలువురి సన్మానం

చిగురుమామిడి, జూలై 28: మండల కేంద్రానికి చెందిన బొల్లి ఐలయ్య ఆదివారం డాక్టరేట్ అందుకున్నారు. త్యాగరాజ గానసభలో శ్రీరామ కృష్ణవేణి సొసైటీ ఆధ్వర్యంలో ఏసియా వేదిక రీసెర్చ్ యూనివర్సిటీ నిర్వాహకుల అవార్డును అందించారు. చిగురుమామిడి మండలానికి చెందిన వ్యక్తి డాక్టరేట్ అవార్డు రావడం అబినందనీయమని ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి అన్నారు. 20 సంవత్సరాల నుంచి అనేక సామాజిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాల దృష్ట్యా డాక్టరేట్ రావడం సంతోషకరమన్నారు. తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని అవార్డు గ్రహిత ఐలయ్య అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన పలువురు సత్కరించారు.